ప్రజాశక్తి
శనివారం 27 మే 2023
5
పార్వతీపురం మన్యం



నిరంతర విద్యుత్తు సరఫరా

ప్రజాశక్తి-విజయనగరం

విద్యుత్ వినియోగదారులకు నిరంతరాయ విద్యుత్తును సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నామని ఆ సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్(ఆపరేషన్స్) వి.విజయలలిత శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇపిడిసిఎల్ పరిధిలోని ఐదు జిల్లాల్లో ఎక్కడ విద్యుత్ కోతల్లేవని, అంతరాయాలు లేకుండా విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టిందని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా కరెంటు కోటాను అందిస్తుందని, రోజూవారీ సరాసరి 90 మిలియన్ యూనిట్ల విద్యుత్ డిమాండ్ ఉన్నప్పటికి కోతలు లేకుండా సరఫరా చేస్తున్నామని తెలిపారు. కేవలం సాంకేతిక సమస్యలతోనే సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నాయని, సంస్థ పరిధిలో ఎక్కడా విద్యుత్ కోతలను అమలు చేయడం లేదని స్పష్టం చేశారు.

పాడి రైతును పట్టించుకోరా?

- బీమా చెల్లింపుల కోసం పాడి రైతుల ఎదురుచూపు
- మినీ గోకులాల బిల్లుల అందక కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ
- జిల్లాలో నేటికీ ప్రారంభం కాని జగనన్న పాలవెల్లువ
- కిసాన్ క్రెడిట్ కార్డుకు బ్యాంకు కష్టాలు

జిల్లాలో పాడి పరిశ్రమ పరిస్థితి రోజురోజుకు అయోమయంగా మారుతుంది. జిల్లాలో ఎంతోమంది చిన్న, సన్న కారు రైతులతో పాటు వంటరి మహిళలకు జీవనోపాధిగా ఉన్న పాడి పరిశ్రమను ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పాడి రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పశువుల బీమా కోసం ఏళ్ల తరబడి పాడి రైతుల ఎదురుచూస్తున్న నేటికీ బకాయిల చెల్లింపులు జరగడం లేదు.

ప్రజాశక్తి - కలెక్టరేట్

జిల్లాలో ఇప్పటి వరకు 1776 పశువులు చనిపోగా, వీటిలో 376 మంది పాడిరైతులకు మాత్రమే సుమారు రూ.98,50,000 చెల్లింపులు జరిగాయి. ఇంకా 1400 పశువులకు సంబంధించి రూ.నాలుగు కోట్ల 34 లక్షల 55వేలు రైతులకు చెల్లించాల్సి ఉంది. అలాగే 1480 జీవాలకు గానూ రూ.5.90లక్షలు రైతులకు చెల్లించాల్సి ఉంది.

గోకులాల బిల్లులందక కార్యాలయాల రైతుల చుట్టూ ప్రదక్షిణ

జిల్లాలోని 15 మండలాల్లో గల 215 పంచాయతీల్లో 1347 గోకులం నిర్మాణాల పనులకు అంచనా వేయగా వీటిలో 369 గోకులాల పనులు పూర్తయ్యాయి. వీటికి కూడా చాలా వరకు బిల్లులు అందక రైతులు పశుసంవర్ధకశా కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో చాలామంది రైతులు పరిష్కారం కోరగా ఎటువంటి ఫలితం లేకుండా పోయింది. నిర్మాణం పూర్తయిన గోకులాలకు బిల్లులు అందకపోవడంతో జిల్లాలో కేటాయించిన వాటిలో 423 పునాది స్థాయిలో, 226 పై కప్పు స్థాయిలో 329 నిర్మాణానికి నోచుకోకుండానే మిగిలిపోయాయి.

కానరాని జగనన్న పాలవెలువ

రైతుల నుంచి పాలు సేకరించి నిల్వ చేయడానికి ప్రభుత్వం జగనన్న పాలవెల్లువ కార్యక్రమం ద్వారా రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, మన జిల్లాకు 97 బల్క్ మిల్క్ సెంటర్లు, 198 ఆటోమేటిక్ మిల్క్ కలెక్షన్స్ సెంటర్లు కేటాయించింది. అయితే వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్ల గడుస్తున్నా నేటికీ ఒక్కచోట కూడా ప్రారంభం కాలేదు. ఆఖరుకు పాలకు గిట్టుబాటు ధర కల్పిస్తామని, లీటర్‌కు నాలుగు రూపాయలు అదనంగా ఇస్తామని చెప్పిన ప్రభుత్వం, ఆ హామీని అమలు చేయకపోవడంతో రైతులకు నిరాశే మిగిలింది.

కిసాన్ క్రెడిట్ కార్డుకు బ్యాంకు కష్టాలు

పశువులకు దాణా, ఇతర ఖర్చులు నిమిత్తం పాడి రైతుకు ఎటువంటి హామీ లేకుండా ఒక్కో రైతుకు రూ.లక్షా 60వేలు రుణ సదుపాయం కల్పిస్తామని, దీనికోసం పాడి రైతులకు పశు కిసాన్ క్రెడిట్ కార్డులను అందజేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చారు. ఇందుకోసం 273 మంది పాడి రైతులు దరఖాస్తు చేసుకోగా, వారికి నేటికీ క్రెడిట్ కార్డులు అందక ఎదురుచూస్తున్నారు.

వీడని మందుల సమస్య

పశుసంవర్ధక శాఖలో మందులు సమస్య రోజురోజుకు ఎక్కువవుతుంది. పశువులకు టీకాలు, సాధారణ జ్వరాలకు ఇచ్చే మందులు, ప్రాథమిక చికిత్సకు అవసరమయ్యే మందులు తప్ప మిగిలిన చాలా రకాల మందులను కొనుక్కోమని పశు వైద్యులు మందుల చీటీలు రాసిస్తున్నారు. బయటి మార్కెట్లో పశువుల మందులు కొనుగోలు చేయడం ద్వారా ఎక్కువ మొత్తం ఖర్చు చేయాల్సి వస్తుందని, దీంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని పాడి రైతులు వాపోతున్నారు.

బీమా కోసం ఎదురుచూపు

రెండేళ్ల క్రితం చనిపోయిన మా ఆవుకు బీమా నిమిత్తం ప్రక్రియ అంత పూర్తి చేసి అధికారులకు దరఖాస్తులు అందజేశాం. కానీ నేటికీ బీమా అందలేదు. దీనికోసం పశు వైద్య సహాయకులను పలుమార్లు సంప్రదించగా ఎటువంటి ఫలితం లేకుండా పోయింది.

- భాస్కరరావు, అడ్డాపుశీల

సహకార సంఘాల ద్వారానే పాల సేకరణ జరగాలి

రైతుల నుంచి పాలును అమల్ సంస్థ ద్వారా సేకరించాలని ప్రభుత్వం యోచిస్తోంది. దీని ద్వారా పాడి రైతులు నష్టపోయే అవకాశం ఉంది. కావున సహకార సంఘాల ద్వారానే పాలు సేకరించి, సహకార సంఘాలను బలోపేతం చేయాలి. అలాగే రైతులకు బీమా బకాయిలను వెంటనే చెల్లించాలి. పెండింగ్‌లో ఉన్న గోకులం బిల్లులను వెంటనే విడుదల చేయాలి. పాలకు గిట్టుబాటు ధర కల్పించి, జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి లీటరు పాలుకు రూ.4 అదనంగా చెల్లించి రైతులకు న్యాయం చేయాలి.

- రెడ్డి లక్ష్మునాయుడు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి.

పాడిని పూర్తిగా వదిలేశాం

గత పదేళ్లుగా రెండు ఆవులతో పాడి రైతుగా కొనసాగినప్పటికీ, ఈ రెండేళ్ల కాలంలో రెండు ఆవులు చనిపోగా వాటి బీమా డబ్బులు అందలేదు. పశువులకు అనారోగ్యం వస్తే మందులు, డాక్టర్లకు చెల్లించే ఫీజులు అధికమవడం, దాణాధరలు ఎక్కువగా పెరిగిపోయాయి. పాలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో పూర్తిగా పాడినే విడిచి పెట్టాను.

-అక్కేన చంద్రశేఖర్, అడ్డాపుశీల

శిఖపరువు కొండలు

శిఖపరువు వైపు కదులుతున్న డొంక

- మైనింగ్ తవ్వకాల కోసం అధికారులపై ఒత్తిడి
- వైసిపి పెద్దలే సూత్రధారులు

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని పట్టుచెన్నూరు పంచాయతీ పరిధిలో గల శిఖపరువు మైనింగ్ కొండపై మళ్లీ బడాబాబుల దృష్టి మళ్ళింది. కొద్ది సంవత్సరాల క్రితం ఇక్కడ తవ్వకాల కోసం ప్రయత్నించి విఫలమైన కాంట్రాక్టరు అకాల మరణం చెందారు. ఆయనతో ఆర్థిక సంబంధాలున్న అధికారపార్టీ అగ్రనేత ఒకరు ఇప్పుడు శిఖపరువు మైనింగ్ తవ్వకాలకు పావులు కదుపుతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. శిఖపరువు గ్రామానికి కూతవేటు దూరంలో ఉన్న మాంగనీస్ కొండపై చాలాకాలంగా బడాబాబులు దృష్టి సారించారు. ఈ ప్రాంతంలో తవ్వకాలకు సంబంధించి శిఖపరువు గ్రామస్తుల అభిప్రాయం సేకరణ చేపట్టారు. పర్యావరణ, రెవెన్యూశాఖల అధికారుల ఆధ్వర్యాన ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించడానికి ప్రయత్నం చేశారు. అయితే సిపిఎం ఆధ్వర్యాన శిఖపరువు గిరిజనులు తీవ్రంగా ప్రతిఘటించారు. దీంతో ఆ ప్రతిపాదన అటకెక్కింది. ఇప్పుడు మళ్లీ ఆ ప్రతిపాదన తెరపైకి వస్తోంది. కొద్దిరోజుల క్రితం అటవీశాఖ చీఫ్ కన్సర్వేటర్ శ్రీరంగనాథ్‌రెడ్డి శిఖపరువు మైనింగ్ కొండను పరిశీలించారు. స్థానిక అటవీశాఖ అధికారులు సిబ్బందితో కలిసి ఆయన ఈ ప్రాంతంలో పర్యటించడంపై గిరిజనులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రా - ఒడిశా వివాదాస్పద కొటియా గ్రామాల్లో ఒకటైన పట్టుచెన్నూరు పంచాయతీ పరిధిలో శిఖపరువు గ్రామం ఉంది. ఇది పూర్తిగా అన్ సర్వే ప్రాంతంలో ఉంది. ఇలాంటి ప్రాంతంలో ఎలాగైనా మాంగనీస్ మైనింగ్ తవ్వకాలు చేయాలనే యోచనలో బడాబాబులు ఉన్నారు. అధికారపార్టీకి చెందిన కీలకమంత్రి ఒకరు శిఖపరువు మైనింగ్ తవ్వకాలపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ప్రాంతంలో కొన్ని మైనింగ్ తవ్వకాలకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేసింది. ప్రభుత్వానికి ఆదాయం రాబట్టుకోవడానికి గ్రామ సభలు నిర్వహించకుండానే అనుమతులు మంజూరు అవుతున్నాయి. ఈ నేపథ్యంలో శిఖ పరువు మైనింగ్ తవ్వకాలకు సంబంధించి చాపకింద నీరులా బడాబాబులు ప్రయత్నాలు సాగిస్తున్నారు.

పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న ఇన్‌ఛార్జి జెసి విష్ణుచరణ్

జెవికె కిట్ల పరిశీలన

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

స్థానిక డివిఎం మున్సిపల్ హైస్కూల్‌లో జగనన్న విద్యా కానుక కిట్లను, పాఠ్య పుస్తకాలను ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్, ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్ శుక్రవారం పరిశీలించారు. పాఠశాలకు వచ్చిన పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, బ్యాగులు, జెవికె సామాగ్రిని పరిశీలించారు. విద్యార్థులందరికీ సరిపడా పుస్తకాలు అందజేయాలని ఆదేశించారు. ఆయన వెంట డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఉన్నారు.

కురుపాం : స్థానిక ఆదర్శ పాఠశాల వద్ద గల జెవికె కిట్లను ఎపిఎం వి.కిషోర్ కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ వేణుగోపాల్ రెడ్డి శుక్రవారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా యూనిఫాం, బ్యాగులు, పుస్తకాలు జెవికె మెటీరియల్ నాణ్యతను పరిశీలించి మండలానికి సంబంధించిన స్టాకు వివరాలు ఎంఇఒ ఎన్.సత్యనారాయణకు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఆర్పిలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మండలంలో శుక్రవారం విస్తృతంగా పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించారు. రేగిడిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్వాడీ, నాడు నేడు పనులు, గృహ నిర్మాణం పనులు తనిఖీ చేసిన కలెక్టర్ అనంతరం మేదరగండలో జరుగుతున్న నాడు-నేడు పనులు తనిఖీ చేశారు. రేగిడిలో నాడు-నేడు పనులకు రూ.15.93 లక్షలు, మేదరగండలో రూ11.97 లక్షలు మంజూరయ్యాయి. నాడు-నేడు పనులు వేగవంతం చేసి బడులు ప్రారంభమయ్యే నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పనుల నాణ్యతలో రాజీపడొద్దని స్పష్టం చేశారు. ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తూ మంజూరు చేసిందని అంతే ప్రాధాన్యతతో పూర్తి చేయాలని ఆయన స్పష్టం చేశారు. పాఠశాలలు ఆహ్లాదంగా తయారుకావడం, విద్యార్థులు మంచి వాతావరణంలో చదువుకోవడం ముఖ్యోద్దేశ్యమన్నారు. ఆసుపత్రిలో అన్ని విభాగాలను పరిశీలించారు. అన్ని మందులు, ముఖ్యంగా అత్యవసర మందులు అందుబాటులో ఉండాలన్నారు. వైద్యం కోసం వచ్చే వారికి మంచి వైద్యం అందించాలని ఆయన ఆదేశించారు. వైద్యం కోసం ఎక్కువగా గిరిజనులు వస్తారని, వారితో మమేకమై వైద్యం అందించాలన్నారు. ఫ్యామిలీ డాక్టరు వైద్య సేవలు గ్రామాల్లో పక్కాగా నిర్వహించాలని, కదల్లేని స్థితిలో ఉన్న వారిని ఇంటివద్దనే కలిసి వైద్యం అందించాలని ఆయన ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రంలో ఆహారం, రికార్డులు, చిన్నారులకు బోధనా తీరును పరిశీలించారు. చిన్నారులతో రైమ్స్ చెప్పించారు. కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. చిన్నారులకు మంచి ఆహారం అందించాలని, తద్వారా పౌష్టికాహారం అంది వారి బంగారు భవితకు బాటలు పడతాయని అన్నారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ సక్రమంగా ఉండాలన్నారు. గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. గృహ నిర్మాణంపై లబ్దిదారులకు అవగాహన కల్పించాలన్నారు. నిర్మాణ సామగ్రి అందించడంలో ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన స్పష్టం చేశారు. అభివృద్ధి పనులు వేగవంతం చేసి జిల్లాను ఆదర్శంగా నిలపాలని ఆయన చెప్పారు. కలెక్టర్ వెంట జిల్లా వైద్య ,ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బగాది జగన్నాథ రావు, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి కె.విజయగౌరి, డిఇఒ ఎన్.ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పిల్లలతో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

డిఆర్‌ఒకు వినతిని అందజేస్తున్న సిఐటియు నాయకులు

ఇఎస్‌ఐ ఆస్పత్రి ఏర్పాటు చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - కలెక్టరేట్

జిల్లాలో ఇఎస్ఐ 30 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం డిఆర్‌ఒకు సిఐటియు నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు మాట్లాడుతూ మన్యం జిల్లా కొత్తగా ఏర్పాటైయినా కార్మికుల ఆరోగ్యం కోసం ఇఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం ఉందన్నారు. జిల్లాలో ఆర్‌టిసి, మున్సిపల్ కార్మికులు, ఉద్యోగస్తులు, ఇతర కార్మికులకు వైద్య సౌకర్యం లేక ఇతర జిల్లాలకు వైద్యం కోసం వెళ్లాల్సిన అవస్థలు పడుతున్నారని అన్నారు. అలాగే కార్మికులకు ఆసుపత్రి, మందులు, పెన్షన్లు, సిక్ వేతనాలు నిరుద్యోగ భృతి తదితర సౌకర్యాలు కల్పించే ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ ఇఎస్ఐ పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నయని, కావున ఇఎస్ఐ పథకాన్ని పకడ్బందీగా అమలు చేసి కొత్తగా ఏర్పడిన మన్యం జిల్లాలో 30 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, నాయకులు వై.శాంతి కుమారి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

నేడు పార్వతీపురం మున్సిపల్ సమావేశం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మున్సిపల్ సాధారణ సమావేశం ఈనెల 27న (శనివారం) ఉదయం 11గంటలకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరుగుతుందని కమిషనర్ జె.రామప్పలనాయుడు శుక్రవారం ఒక ప్రకనటలో పేర్కొన్నారు. చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు హాజరు కానున్నారన్నారు. కావున కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

మూలలంకలో ఫ్యామిలీ డాక్టర్

వీరఘట్టం: మండలంలోని మూలలంక గిరిజన గ్రామంలో శుక్రవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జి .ప్రదీప్ కుమార్ రక్తపోటు, మధుమేహ, జ్వర పీడితులు తదితరమైన రోగులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ నవోనమ్మ, ఎఎన్ఎం పైడితల్లి, టెక్నీషియన్ దినేష్, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న వైసిపి నాయకులు

ఫ్లెక్సీల చించివేతపై ఫిర్యాదు

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని వివిధ కూడళ్లలో వైసిపి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల చింతివేతపై అధికారపార్టీ పట్టణ నాయకులు, కౌన్సిలర్లు శుక్రవారం టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పేదలకు, పెత్తందార్లకు మధ్య యుద్ధం అనే టైటిల్‌తో తయారు చేసిన ఫ్లెక్సీలను పట్టణంలో పలు చోట్ల ఏర్పాటు చేశారు. అయితే వెంకటేశ్వరా డీలక్స్ సెంటర్, శివాజీ బొమ్మ జంక్షన్, బోసు బొమ్మ జంక్షన్, లెప్రసీ ఆసుపత్రి కమ్యూనిటీ హాలు వద్ద ఉన్న ఫ్లెక్సీలను చించివేశారని ఫిర్యాదు చేశారు. పట్టణ వైసిపి అధ్యక్షులు వంగపండు అప్పలనాయుడు ఆధ్వర్యాన కౌన్సిలర్లు, నాయకులు ఫిర్యాదు అందజేశారు. విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై అప్పలనాయుడు మాట్లాడుతూ ఫ్లెక్సీల చించివేత వెనుక టిడిపి నాయకుల ప్రమేయం వుండొచ్చునని అనుమానం వ్యక్తం చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో వైసిపి పట్టణ మాజీ అధ్యక్షులు జర్జాపు సూరిబాబు, కౌన్సిలర్లు గిరిరఘు, గొర్లి వెంకటరమణ, గుల్లిపిల్లి నాగేశ్వరరావు, పప్పల లక్ష్మణరావు, పాలవలస మధుసూదనరావు, వైసిపి నాయకులు కర్రి అప్పలస్వామి,కర్రి మహేష్,ఈదుబిల్లి రమేష్ నాయుడు వున్నారు.

అభివృద్ధి గోరంత... ప్రచారం కొండంత

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

అధికారంలోకి వస్తే మీ సమస్యలు పరిష్కరిస్తాం, మీ గ్రామాలను అభివృద్ధి చేస్తాం అని హామీలు ఇచ్చిన ప్రజా ప్రతినిధులు తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ గ్రామాల వంక కన్నెత్తి అయిన చూసే పరిస్థితి కనిపించడం లేదు. నిత్యం సమస్యలతో గిరిజనులు సహజీవనం చేస్తున్నారు. ప్రభుత్వాలు, పాలకులు అధికారులు మారుతున్నా గిరిజన జీవితాల్లో మాత్రం మార్పు రావడం లేదు. గ్రామాల్లో చిన్నపాటి అభివృద్ధి పనులు చేస్తే కొండంత ప్రచారం చేయడం పరిపాటిగా మారింది. తీరా గ్రామాలకు వెళ్లి చూస్తే గోరంత అభివృద్ధి కూడా జరగని పరిస్థితి. స్వాతంత్ర్యం వచ్చి నేటికి 77 ఏళ్లు గడుస్తున్నా గిరిజన గ్రామాలు నేటికీ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయి. గిరిజనులు దుర్భర జీవనం గడుపుతూ కాలం వెల్లదీస్తున్నారు.

మండలంలో 27 పంచాయతీలుండగా సుమారు 200 గ్రామాలు ఉన్నాయి. వీటిలో సగం పైగా గ్రామాలు మారుమూల కొండలపైనే ఉన్నాయి. వాడపుట్టి, వనకాబడి, జోగిపురం, శంభుగూడ, వాడ జంగి, ఇజ్జ కాయి, టంకు, గుల్లలంక, మంత్ర జోల, చిన్న రావి కోన, కొండ బిన్నిడి, బయ్యాడ తదితర మారుమూల కొండ శిఖర గ్రామాల ప్రజలు నేటికీ బాహ్య ప్రపంచానికి దూరంగా ఉంటున్నారు. ఈ గ్రామాలకు రహదారి సౌకర్యం లేకపోవడంతో గిరిజనులు విద్య, వైద్యం, తాగునీరు వంటి కనీస మౌలిక వసతులకు నేటికీ నోచుకోవడంలేదు. కొండలపై ఉన్న గ్రామాల్లో గిరిజనులకు చలములు, గెడ్డవాగులే దిక్కు. దీంతో గిరిజనులు కలుషిత నీటిని తాగుతూ వ్యాధుల బారిన పడుతున్నారు. అనారోగ్యం వాటిల్లితే అత్యవసర సమయాల్లో వైద్య సేవలు అందని పరిస్థితి. దీంతో తరచూ మరణాల సంఖ్య ఎక్కువ నమోదు కావడం విచారకరం. రోడ్డు సౌకర్యం లేకపోవడంతో గర్భిణీలు, వృద్ధులను వైద్యం కోసం డోలీల సాయంతో ఆసుపత్రికి తీసుకొస్తున్నారు. దీంతో గిరిజనులు అష్టకష్టాలు పడాల్సిందే. గిరిజన విద్యార్థులకు విద్య కూడా అందని ద్రాక్షగానే ఉంటుంది. కొండలపై గ్రామాలకు అధికారులు పర్యవేక్షణ అంతంతమాత్రంగానే ఉండడంతో చాలా వరకు విద్యార్థులు డ్రాపౌట్ సంఖ్య కనిపిస్తోంది. ప్రతి నెలా రేషన్ సరుకులు కోసం కొండ దిగి కిందకు వస్తున్నారు. పక్కాఇళ్లు లేకపోవడంతో శిథిలమైన రేకిళ్లలోనే తలదాచుకుంటున్నారు. గ్రామాల్లో సమస్యలు పరిష్కారం కావాలంటే, గ్రామాల్లో అభివృద్ధి పనులు జరగాలంటే రహదారి సౌకర్యం నిర్మించాలని పైగ్రామాల గిరిజనులు వేడుకుంటున్నారు.

గిరిజనుల పట్ల చిన్నచూపు....

పాలకులకు గిరిజనుల పట్ల చిన్నచూపు స్పష్టంగా కనిపిస్తోంది. ఓట్లు మీద ఉన్న శ్రద్ధ గిరిజనుల సమస్యల పరిష్కారంలో లేదు. గిరిజనుల నిరక్షరాస్యత కారణంగా సమస్యలపై ప్రశ్నించలేని పరిస్థితి. ఇప్పటికైనా స్పందించి గిరిజనుల సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాల్సిన అవసరం ఉంది.

కోలక అవినాష్, ఎపి గిరిజన సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు.

రోడ్డు సౌకర్యం లేక డోలిలో గర్భిణిని తీసుకొస్తున్న గిరిజనులు

కనీస సౌకర్యాలకు నోచుకోని గిరిజన గ్రామాలు
రోడ్డు, తాగునీరు, వైద్యం కరువే

చెలమల నీటిని తెచ్చుకుంటున్న చిన్నరావికోన గిరిజనులు

గిరిజనులకు నిత్యం కష్టాలే...

తాగునీరు, వైద్యం కోసం గిరిజనులు నిత్యం కష్టాలు పడుతున్నారు. కొండపైన గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం లేకపోవడంతో కిలోమీటర్ల మేర ఎండ, వానలో కాలినడకన పనులు నిమిత్త మండల కేంద్రానికి వస్తున్నారు. అధికారులు స్పందించి రహదారి నిర్మాణాలకు ప్రాధాన్యత ఇవ్వాలి.

పువ్వల తిరుపతి రావు, ఎపి గిరిజన సంఘం మండల కార్యదర్శి

అభివృద్ధి జరగడం లేదు...

ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా గిరిజనుల పట్ల చిన్నచూపు కొనసాగుతూనే ఉంది. గిరిజన అభివృద్ధి, సంక్షేమం కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నామని ప్రభుత్వాలు ప్రకటనలు చేస్తున్న ఆచరణలో ఎక్కడా కానరావడం లేదు.

తోయక జగదీశ్వరి, టిడిపి కురుపాం ఇన్‌ఛార్జి.

మూడుచక్రాల వాహనాలను అందజేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

వికలాంగులకు వాహనాలు పంపిణీ

ప్రజాశక్తి - కురుపాం

ప్రభుత్వం అందిస్తున్న వాహనాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పి.పుష్ప శ్రీవాణి అన్నారు. వయోవృద్ధుల సహాయ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం చినమేరంగిలోని ఆమె అతిథిగృహంలో వికలాంగులకు వాహనాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గానికి రూ.12 లక్షల విలువ గల 10 రిట్రో ఫిటెడ్ మూడు చక్రాల మోటరైజ్డ్ వాహనాలను 10 మంది అర్హతగల శారీరక వికలాంగులకు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. వీటిని సక్రమంగా వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వయోవృద్ధుల సహాయ సంచాలకులు కె.కవిత, విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు

ప్రజాశక్తి-సీతంపేట

గిరిజన గ్రామాల్లో మలేరియా, డెంగీ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ కొండపల్లి సత్యం కార్యదర్శులను ఆదేంచారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో ఫ్రైడే కార్యక్రమం నిర్వహించాలన్నారు. సిటిజన్ అవుట్ రిచ్ సర్వే వాలంటీర్లు తప్పనిసరిగా రెండు రోజులు పాటు నిర్వహించాలని ఆదేశించారు. గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యదర్శులు సుదర్శన్ రావు, పాపారావు, వినోద్, అప్పలసూరి, అప్పలస్వామి, కామేశ్వరరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.



బాధితునికి వంటసామగ్రి అందజేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ శ్రీరాములు

బాధితులను ఆదుకున్న రెడ్‌క్రాస్

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రంలో గల మంతినివలస కాలనీ చెందిన బచ్చల మోహనరావు ఇల్లు ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో కాలిపోవడంతో బాధితులుకట్టు బట్టలతో మిగిలారు. దీంతో విషయం తెలుసుకున్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ మంచుపల్లి శ్రీరాములు శుక్రవారం వారి ఇంటి వద్దకు వెళ్లి కుటుంబ సభ్యులకు నిత్యావసర సరుకులు, వంట సామగ్రి, టార్పాలిన్ అందజేసి ఆదుకున్నారు. కార్యక్రమంలో కళింగ వైశ్య రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ కొత్తకోట సురేష్, కురుపాం కళింగ వైశ్య సంఘం అధ్యక్షులు కొత్తకోట రవీంద్ర కుమార్, వర్తక సంఘం అధ్యక్షులు బరాటం గుంపస్వామి తదితరులు పాల్గొన్నారు.

మండల విద్యాశాఖాధికారులతో మాట్లాడుతున్న డిఇఒ ప్రేమ్‌కుమార్

ఎంఆర్‌సిని సందర్శించిన డిఇఒ

ప్రజాశక్తి - కురుపాం

జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ శుక్రవారం స్థానిక ఎమ్మార్సీని అకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఇఒ ఎన్.సత్యనారాయణతో మాట్లాడుతూ మండలంలో ఇంత వరకు జరిగిన నాడు-నేడు పనుల స్థితిగతులు మొదటివిడతలో పూర్తయిన పాఠశాల వివరాలు, రెండవ పేజీలో ప్రస్తుతం జరుగుతున్న పాఠశాలల పనుల వివరాలు తెలుసుకోవాలన్నారు. పాఠశాలలు తెరిచేసరికి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే జెవికె కిట్లు విద్యార్థులందరికీ సక్రమంగా అందేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి. శంకర్రావు, సిఆర్పిలు పాల్గొన్నారు.

మంతినివలసలో ఫ్యామిలీ ఫిజీషియన్

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రంలో సచివాలయం-1 పరిధిలో గల మంతినివలసలో ఫ్యామిలీ ఫిజీషియన్ 104 ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమనికి రావాడ రామభద్రపురం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ చీకటి శంకరరావు హాజరై 65 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి బిపి, షుగర్ ఉన్నవారికి మాత్రలు ఇచ్చి క్రమం తప్పకుండా వేయాలని సూచించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్ పి.జాకబ్, ఎఎన్ఎంలు నిర్మల, పద్మ, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, సిహెచ్‌డబ్ల్యు లు పాల్గొన్నారు.

సిరిమానుకు పూజలు చేస్తున్న కమిటీ సభ్యులు

ఇప్పలపోలమ్మ సిరిమాను చెట్టుకు పూజలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలో ఈనెల 28, 29, 30 తేదీల్లో పార్వతీపురం గ్రామ దేవత అయిన ఇప్పల పోలమ్మ అమ్మవారి పండగ మహోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో అమ్మవారి సిరిమానుకు శుక్ర వారం పండగ నిర్వాహక సభ్యులు పూజలు నిర్వహించారు. రైతులు, యువకులతో అమ్మవారి గుడి నుంచి బయలుదేరి పట్టణంలో గల బుగత వారి తోటలో సిరిమాను మహోత్సవానికి అవసరమైన పాసి చెట్టును గుర్తించి పూజలు నిర్వహించారు. అనంతరం చెట్టును అమ్మవారి గుడికి తీసుకువచ్చారు. ఈ చెట్టును విశ్వబ్రాహ్మణులైన చిట్టూరి వంశస్థులు పండగ ఊరేగింపునకు అవసరమైన సిరిమానును సిద్ధం చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు..

ట్రాన్స్‌ఫార్మర్ చోరీ

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చలివేంద్రి పంచాయతీ పరిధి మహదేవివలస సమీపాన ఎస్.వెంకట్రావు నాయుడు పంట పొలాల్లో ఏర్పాటు చేసిన 16కెవి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి చోరీ చేశారు. శుక్రవారం గ్రామస్తులు ట్రాన్స్‌కో ఎఇ బాలాజీకి ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై స్థానిక పోలీస్ స్టేషన్లో ఎఇ బాలాజీ ఫిర్యాదు చేశారు. ఇది ఇలా ఉండగా మండలంలోని చిట్టిపూడి వలస జంక్షన్ వద్ద గల ట్రాన్స్ఫార్మర్‌లో విలువైన సామాగ్రిని చోరీ జరిగింది. ఈ విషయాన్ని బయటికి రాకుండా విద్యుత్తు అధికారులు గోప్యంగా ఉంచినట్టు తెలిసింది.

పైనాపిల్‌కు మార్కెట్ సౌకర్యం

ప్రజాశక్తి - సీతంపేట

పైనాఫిల్ రైతులకు గిట్టుబాటు ధర కలిగేలా మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని జిల్లా ఉద్యానశాఖ అధికారి కె.సత్యనారాయణ రెడ్డి అన్నారు. శుక్రవారం పైనాఫిల్ రైతులు, ఎన్జీవో సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటిడిఎ పిఒ కల్పన కుమారి ఆదేశాల మేరకు రాష్ట్రంలో 66 రైతు బజార్లలో అమ్ముకొనేందుకు వీలుగా అనుమతులు తీసుకున్నామని తెలిపారు. ఈ రైతు బజార్లలో ఎక్కడైనా రైతులు తమ పంటను అమ్ముకోవచ్చన్నారు. అందరూ ఒకే రైతు బజార్ కాకుండా అన్ని రైతు బజార్లకు రైతులంతా వెళ్లేలా ప్రణాళిక వేసుకోవాలన్నారు. పంటను ఒకేసారి కాకుండా విడతల వారీగా కోసుకోవాలని అన్నారు. రైతు బజార్లలో అమ్ముకోవడానికి అవసరమయ్యే అనుమతులను ఈనెల 27 నుంచి ఐటిడిఎలోని ఉద్యానశాఖ సిబ్బంది ద్వారా తీసుకోవచ్చని అన్నారు. అనుమతులు కావాల్సిన వారు తమ సంఘం బ్యాంక్ పాస్ బుక్, రైతు ఆధార్ కార్డ్, ఒక ఫోటో తీసుకురావాలని సూచించారు. రైతు బజార్లలో అమ్ముకొనేటప్పుడు ఏమైనా ఇబ్బందులు వస్తే వెంటనే ఉద్యానశాఖ అధికారులకు సంప్రదించాలని కోరారు. సమస్యను ఐటిడిఎ పిఒ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకొంటామని అన్నారు. సమావేశంలో డిహెచ్ఒ సత్యనారాయణ రెడ్డి, జిసిసి డిఎం జి.సంధ్యారాణి, వెలుగు ఎపిడి రమణ, ఉద్యానశాఖ అధికారులు అయంతి, అమరేశ్వరి, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యానశాఖ అధికారి సత్యనారాయణరెడ్డి

అన్‌సర్వే భూములకు పట్టాలివ్వాలి

ప్రజాశక్తి-సాలూరు రూరల్

గిరిజనులు సాగు చేస్తున్న అన్ సర్వేడ్ భూములకు పట్టాలు ఇవ్వాలని గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు సాలూరు మండలం పులివలస, కొత్తూరు, పనస వలస గ్రామాల గిరిజన భూములు వద్ద గిరిజన సంఘం ఆధ్వర్యాన శుక్రవారం నిరసన తెలిపారు. గిరిజన సంఘం నాయకులు చింత జోగయ్య, సూక్రు గంగయ్య, గెమ్మల బోడమ్మ అబ్రహం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. తాతల కాలం నుండి సాగు చేస్తున్న భూములకు అధికారులు పట్టాలు మంజూరు చేయకపోవడం వల్ల కొందరు ప్రైవేటు వ్యక్తులు గిరిజనులను బెదిరించి భూములు లాక్కునేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. వీరికి మద్దతుగా సిపిఎం నాయకులు మర్రి శ్రీనివాసరావు, కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరా తీసుకొని గిరిజన భూములనుకాజేయాలని ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. గిరిజన భూములకు రక్షణ కల్పించాలంటే గిరిజనులు సాగు చేస్తున్న భూములకు వెంటనే పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రత్యేక శిక్షణా కేంద్రంలో పిఒ తనిఖీ

ప్రజాశక్తి- పార్వతీపురంరూరల్

పదో తరగతి ఫెయిల్ విద్యార్థుల కోసం మండలంలోని రావికోనలో గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణా కేంద్రాన్ని ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్ శుక్రవారం పరిశీలించారు. విద్యార్థులకు ఏవిధంగా పాఠాలు చెబుతున్నారో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. రానున్న పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

వాటర్ ట్యాంకు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పనుకుపేటలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి గానూ 20వేల లీటర్ల సామర్థ్యం గల ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఇదే గ్రామంలో గతంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం శాశ్వత మంచినీటి సమస్య పరిష్కారానికి అవసరమైన వాటర్ ట్యాంక్ నిర్మాణానికి అవసరమైన రూ.20 లక్షల నిధులను గడప గడపకు కార్యక్రమం ద్వారా మంజూరు చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బంకూరు పద్మావతి, శ్రీహరి, జెడ్పీటీసీ, మామిడి బాబ్జీ, మండల పార్టీ అధ్యక్షులు బి.చిట్టిరాజు, వైసిపి సీనియర్ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు

సమావేశంలో ఎంపిపి శోభారాణి

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామీణ నీటిపారుదల శాఖ అధికారులు మండలంలో ఎక్కడా కూడా నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని ఎంపిపి మజ్జి శోభారాణి అధికారులను కోరారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో సర్వసభ్య సమావేశం ఆమె అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ రహదారి పనులు జరుగుతున్నందున పైపులైన్లు తెగిపోయి నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని వెంటనే అధికారులు స్పందించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని ఆమె కోరారు. అనంతరం మండలంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు తమ శాఖల ప్రగతిని చదివి వినిపించారు. ఈ సందర్భంగా అడ్డాపుశీల ఎంపీటీసీ మాట్లాడుతూ గృహ నిర్మాణ శాఖ అధికారులు ప్రతి శనివారం పర్యవేక్షణ చేస్తామని చెప్పినప్పటికీ మండలంలో ఎక్కడా ఆ కార్యక్రమం జరుగుతున్న దాఖలాల్లేవని ఆరోపించారు. వెలగవలసకు ఆర్‌టిసి బస్సు సౌకర్యం పునరుద్ధరించాలని సర్పంచ్ మడక కష్ణవేణి అధికారులను కోరారు. రావికోనలో పలువురు గిరిజనులకు పోడుపట్టాలు ఇంకా అందాల్సి ఉందని, వాటిపై చర్యలు చేపట్టాలని ఆ గ్రామ సర్పంచ్ కె.రామస్వామి అధికారులను కోరారు. ఎంఇఒ మాట్లాడుతూ నాడు నేడు పనులు వేసవి సెలవుల్లో సంబంధిత పాఠశాలలో జరుగుతున్నందున ప్రజాప్రతినిధులు వాటిపై పర్యవేక్షణ జరిపి తగు సూచనలు ఇవ్వాలని కోరారు. సమావేశంలో ఎంపిడిఒ విజయలక్ష్మి, వైస్ ఎంపిపి సిద్ద జగన్నాధరావు, పలు పంచాయితీలకు చెందిన సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి శోభారాణి

పరిసరాల పరిశుభ్రతకు కృషి చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, తద్వారా చాలా వరకు వ్యాధులు దరిచేరకుండా అరికట్టవచ్చని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు కోరారు. శుక్రవారం 14వ వార్డులో డ్రైడే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులతో మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో దోమల ఆవాసాలను గుర్తించి తగు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా నీరు నిల్వ ఉండేందుకు ఉన్న కారణాలపై దృష్టి పెట్టాలన్నారు. ఇళ్లల్లో ఉండే ఫ్రిజ్‌లు, ఎసి కూలర్లలో కూడా దోమల ఆవాసాలకు కారణమైన నీటి నిల్వలను ఏ విధంగా గుర్తించి నివారించాలో ఆయన స్థానికులకు వివరించారు. వీటిలో ఎక్కువగా డెంగీ జ్వరాలకు కారణమైన దోమలు వృద్ధి చెందుతాయన్నారు. అలాగే ఇళ్ల పరిసరాల్లో ఉండే మురుగు నీటిలో మలేరియా జ్వరాలకు కారణమైన దోమలు వృద్ధి చెందుతాయన్నారు. వైద్య, సంబంధిత శాఖల సిబ్బంది సమన్వయంతో పరిసరాల శుభ్రతపై ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించి, దోమల నివారణా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ఇటు ప్రజల్లో కూడా ఆవాశాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండొచ్చని, పిల్లలు, యువత కూడా అవగాహన పెంచుకోవాలని కోరారు. జ్వరాలను గుర్తిస్తే వైద్య సిబ్బంది అవసరమైన పరీక్షలు చేసి మందులు ఇవ్వడంతో పాటు, అందుకు కారణమైన మూలాలను ఆవాసాల్లో గుర్తించి, నివారణ చర్యలు చేపట్టడం ద్వారా వ్యాధులు వ్యాప్తి చెందకుండా అరికట్టవచ్చని డిఐఒ సూచించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు పుష్ప , జయగౌడ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నివాస స్థలాలను క్రమబద్ధీకరించుకోవాలి

ప్రజాశక్తి - బలిజిపేట

నివాసం కోసం అనధికారికంగా ఆక్రమించిన ఆక్షేపణీయం కాని ప్రభుత్వ భూమిని క్రమబద్ధీకరించుకోవాలని స్థానిక తహశీల్దార్ కె.రత్నకుమారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్రమబద్ధీకరణకు అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో 225ను విడుదల చేసిందన్నారు. కావున మండలంలో అర్హులైన ఆక్రమణదారులంతా నివాసం కోసం ఆక్రమించిన ఆక్షేపణీయం కానీ ప్రభుత్వ భూమిని క్రమబద్ధీకరించుకొనేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. నివాస స్థలాలు అవసరమైన వారు, అక్రమంగా ఆక్రమించిన గృహ లబ్ధిదారులకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ఆక్రమణ విస్తీర్ణం బట్టి విలువ కట్టబడుతుందని ఈ విలువను ప్రభుత్వానికి చెల్లించి ఆక్రమణదారులు నివాస స్థలాలను తమ సొంతం చేసుకోవచ్చని ఆమె తెలిపారు. అయితే 100 చదరపు అడుగుల వరకు ఉచితంగా డీ పట్టా మంజూరు చేయబడినని, 101 నుంచి 200 చదరపు గజాల వరకు బిపిఎల్, ఎపిఎల్ కేటగిరితో సంబంధం లేకుండా అర్హులైన వ్యక్తులంతా 50శాతం మౌలిక విలువ చెల్లించాల్సి ఉంటుందని అన్నారు. 31 నుండి 500 చదరపు గజాల వరకు బిపిఎల్ ఎపిఎల్ కేటగిరీలతో సంబంధం లేకుండా అర్హులైన వ్యక్తులంతా 1.5 రేట్లు మౌలిక విలువ చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆక్రమణలను ప్రభుత్వం తొలగించవచ్చునని ఆమె వివరించారు.

పెదభోగిలిలో గడపగడపకు...

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పెదబోగిలి సచివాలయం పరిధిలో గల వీధుల్లో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎ.జోగారావు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల్లో అర్హులైన ప్రతి పేదవానికి అందే లక్ష్యంతోనే ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ప్రతి సమస్యను పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నామన్నారు. ఇటువంటి ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు సొరకాయల గౌరి, జెడ్‌పిటిసి సభ్యులు ఎం.బాబ్జీ, వైసిపి నాయకులు కె.కూర్మారావు, రమేష్, బి.శ్రీరాములునాయుడు, మండల వైసిపి అధ్యక్షులు బి.చిట్టిరాజు, మాజీ జెడ్పిటిసి టి.అప్పలనాయుడు, స్థానిక వైసిపి నాయకులు, కార్యకర్తలు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

వీరఘట్టం: మండలంలోని పివిఆర్ పురంలో స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కళావతి గ్రామంలోని ప్రతి ఇంటింటికి వెళ్లినప్పుడు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే రహదారి అధ్వానంగా ఉండడం వల్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు గ్రామస్తులు ఎమ్మెల్యే వద్ద విన్నవించుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచి ఉదయాన జగన్మోహనరావు, ఎంపిపి డి.వెంకటరమణ నాయుడు, జడ్పిటిసి జంపు కన్నతల్లి - ఉమామహేశ్వరరావు, యు.వెంకంపేట సర్పంచి లక్ష్మి- సింహాచలం, ఎపిఒ జి.సత్యంనాయుడు, మండల పరిషత్ సీనియర్ సహాయకులు నాగభూషణరావు, విద్య, వైద్య, వెలుగు, పశుసంవర్ధక తదితర శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, కార్యకర్తలు, అభిమానులు, గ్రామ వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

పివిఆర్ పురంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్నఎమ్మెల్యే కళావతి

బదిలీలు, ఉద్యోగోన్నతులు పారదర్శకంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

విద్యా శాఖలో ప్రస్తుతం నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతులను పారదర్శకంగా నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని విశాఖపట్నం ఆర్‌జెడి ఎం.జ్యోతికుమారికి ఎపి ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సామల సింహాచలం తెలిపారు. విశాఖపట్నం జోన్ -1 పరిధిలో గల ఆరు జిల్లాల్లో ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతుల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్లు సక్రమంగా అమలు చేయాలని, ఉపాధ్యాయ బదిలీలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించినప్పుడు ఆయా టీచర్లకు నిబంధనల ప్రకారం పాయింట్లు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. బదిలీలు, ప్రమోషన్లపై ఉపాధ్యాయ సంఘ నాయకులకు సమాచారం ఇవ్వాలని కోరామన్నారు. ఉపాధ్యాయుల వినతులను పరిశీలించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశామన్నారు. ఆర్‌జెడి అన్ని అంశాలపై స్పందించారని, ప్రమోషన్లు, బదిలీలు సజావుగా నిర్వహిస్తామని, రూల్ ఆఫ్ రిజర్వేషన్లు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం అమలు చేస్తామని హామీ ఇచ్చారన్నారని అన్నారు. వినతిని అందజేసిన వారిలో సంఘ నాయకులు బి.నరసింగరావు, పి.లక్ష్మణదొర, కె.మోహనరావు, వరప్రసాద్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రపతిని పిలవకపోవడం హేయమైన చర్య

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

దేశ రాజధాని ఢిల్లీలో సుమారు రూ.1200 కోట్ల వ్యయతో కొత్తగా నిర్మించిన భారత పార్లమెంటు భవనం ప్రారంభానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు కనీసం ఆహ్వానించకపోవడం హేయమైన చర్య అని డిసిసి అధ్యక్షులు నిమ్మక సింహాచలం ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో గల బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద శాంతియుత నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆదివాసీ బిడ్డ అయిన ద్రౌపది ముర్మును కనీసం నూతన పార్లమెంటు భవనం ప్రారంభానికి పిలవకపోవడం చాలా హేయమైన చర్య అని అన్నారు. దేశంలో ఉన్న ఆదివాసీ బిడ్డలకు ఇది చాలా అగౌరవపర్చడమేనని అన్నారు. బిజెపి నిరంకుశ పరిపాలనకు ఇది గొడ్డలి పెట్టని అన్నారు. దేశ ప్రథమ పౌరురాలనే పిలుచు కొనే బిజెపి పార్లమెంటు భవనం ప్రారంభానికి పిలవకపోవడం, కనీసం ఆహ్వానించకపోవడం సిగ్గుచేటన్నారు. ఈ మేరకు కాంగ్రెస్ ఆధ్వర్యంలో కురుపాం నియోజకవర్గంలో శాంతియుత నిరసన కార్యక్రమాన్ని చేపట్టామని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పి.లక్ష్మయ్య, రంగారావు, దుడ్డుకల్లు సర్పంచ్ నిమ్మక నీలావతి తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

పాఠశాలలో మలేరియా నివారణ మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

టిక్కబాయిలో ఎసిఎం ద్రావణం పిచికారీ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని తాడికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల టిక్కబాయిలో శుక్రవారం ఎసిఎం 5% నివారణ పిచికారీ పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ స్ప్రేయింగ్‌లో టిక్క బాయి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల, గ్రామాల్లో స్ప్రేయింగ్ చేయించారు. ఈ సందర్భంగా భద్రగిరి మలేరియా సబ్ యూనిట్ అధికారి మోహన్ మాట్లాడుతూ ఎసిఎం 5% స్ప్రేయింగ్ ప్రతి ఇంట్లోనూ చేయించుకోవాలని, దానివల్ల మలేరియా దోమలు కుట్టిన తర్వాత అవి ఇంటి లోపల గోడలపై వాలుతాయని అన్నారు. వాటికి పేరాలసిస్ వచ్చి అవి గోడ మీద ఉండిపోయి చనిపోతాయన్నారు. కావున ప్రతి ఒక్కరూ ఇంటి లోపల స్ప్రేయింగ్ చేయించుకోవాలన్నారు. తాడికొండలో నిర్దేశిత గ్రామాలను మాత్రమే స్ప్రేయింగ్ చేయిస్తున్నామని, కనుక స్ప్రేయింగ్ చేయించే గ్రామాల్లో ఇంటి మొత్తం స్ప్రేయింగ్ చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు జ్ఞాన ప్రకాష్, డిప్యూటీ వార్డెన్ అప్పారావు, ఎమ్మెల్ హెచ్‌పి ఎం.శాంతి, వైద్య సిబ్బంది నిమ్మకూరి రత్న ప్రసాద్, ఎఎన్ఎం కాంచన, ఆశా కార్యకర్త బి.అల్లమి, తదితరులు పాల్గొన్నారు.

నర్సిపురంలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని నర్సిపురంలో శుక్రవారం పెద్ద ఎత్తున పారిశుధ్య పనులు చేపట్టారు. సర్పంచ్ కర్రి సత్యవతి ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉన్న కాలువలతో పాటు వీధుల్లో ఉన్న కాలువలో కూడా జెసిబిల ద్వారా చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సత్యవతి మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి ఒక్కరూ పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి జి.రూప తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలో కోడిశ పంచాయతీ బొర్రావలసకొండ వాలుపై ఉపాధి హామీ చట్టం ద్వారా నిర్వహిస్తున్న టెర్రసింగ్ పనులను ఎంపిడిఒ కొండపల్లి సత్యం పరిశీలించారు. వేతనదారులకు కూలి గిట్టుబాటు అయ్యేలా మార్కింగ్ కొలతలు ఇవ్వాలన్నారు. వేతనాలు సకాలంలో చెల్లించాలన్నారు పనులు జరిగే చోట తాగునీరు, ప్రథమ చికిత్స బాక్సులు, టెంట్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఎంపిడిఒతో పాటు ఎపిఒ బాబురావు, ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు ఉన్నారు.